సాక్షి
తిరుపతి

ఆదివారం । 24 । మార్చి । 2024





## తాగునీటి ఎద్దడి నివారణే లక్ష్యం

జిల్లావ్యాప్తంగా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

-IIలో



## భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన

తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శనివారం లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

-IIలో

## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ ఆదివారం(సా) | సహర్ సోమవారం(ఉ) |
|---|---|---|
| తిరుపతి | 6-27 | 4-55 |
| గూడూరు | 6-22 | 4-51 |

## న్యూస్‌రీల్

### శాస్త్రోక్తం.. తైలాభిషేకం



ప్రత్యేక అలంకారంలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా తైలాభిషేకం నిర్వహించారు. శని త్రయోదశిని పురస్కరించుకుని స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం విశేష పుష్పాలతో అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

### సైన్స్ పరీక్షకు 562 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలో శనివారం నిర్వహించిన పదోతరగతి సైన్స్ పరీక్షలకు 562 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ శేఖర్ తెలిపారు. మొత్తం 162 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగిన పరీక్షకు 27,388 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను, 26,826 మంది హాజరైనట్లు వివరించారు. అలాగే ఈ పరీక్షకు ప్రైవేటు విద్యార్థులు 2,515 మందికి గాను, 1,336 మంది హాజరైనట్లు వెల్లడించారు. 1,179 మంది గైర్హాజరైనట్లు చెప్పారు.

### కమనీయం.. నృసింహుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు : పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. స్వామిఅమ్మవార్లకు ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ కల్యాణం జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

### మే 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏఓ సయ్యద్ సాహెబ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 50 శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 8నుంచి 14ఏళ్ల లోపు బాలబాలికలకు వివిధ క్రీడల్లో తర్ఫీదు ఇవ్వనున్నట్లు వివరించారు. శిబిరాల నిర్వహణకు పీఈటీలు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు ముందుకురావాలని కోరారు. ఆసక్తి గల వారు ఈ నెల 31వ తేదీ లోపు డీఎస్ఏ కార్యాలయంలో కానీ, 95420 34270, 98663 17312 నంబర్లలో కానీ, 'డీఎస్ఏతిరుపతి.యాహూ.కామ్ మెయిల్‌లో కానీ సంప్రందించాలని సూచించారు.

### శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

## ● విహారం.. సుమనోహరం



తిరుమల శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలకు అశేష భక్తజనం తరలివచ్చారు.. శనివారం నాలుగోరోజు తెప్పలపై దివ్యాలంకారశోభితులైన కొలువుదీరిన ఉభయ దేవేరీ సమేతంగా శ్రీమలయప్పస్వామివారిని దర్శించుకున్నారు.. పుష్కరిణిలో కనులపండువగా జలవిహారం చేసిన వైకుంఠనాథుని వీక్షించి తరించారు. – తిరుమల

## ● సమన్వయం.. సిద్ధం



ఎన్నికలకు తామంతా సిద్ధమని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రకటించారు. శనివారం తిరుపతిలో జరిగిన సమన్వయ సమావేశానికి రీజనల్ కో–ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి నేతలకు దిశానిర్దేశం చేశారు. వచ్చే నెల 2న వీలేరు, 3, 4 తేదీల్లో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సిద్ధం సభలు ఉంటాయన్నారు. అందులో చిత్తూరు లేదా పూతలపట్టులో ఒక సభ, నాయుడుపేట లేదా శ్రీకాళహస్తిలో మరో సభ నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు. సమావేశంలో మంత్రి ఆర్‌కే రోజా, ఎంపీలు గురుమూర్తి, రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వెంకటేగౌడ్, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీలు భరత్, మురళీధర్, సుబ్రమణ్యం, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్‌కుమార్, విజయానందరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, రాజేష్, కృపాలక్ష్మి హాజరయ్యారు. – సాక్షి, తిరుపతి

# ఉల్లంఘనల కట్టడికి విజిల్



ఎన్నికల సమయంలో అక్రమాలను అరికట్టేందుకు సీఈసీ (కేంద్ర ఎన్నికల సంఘం) ప్రత్యేకంగా పలు యాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. అందులో భాగంగానే కోడ్ ఉల్లంఘనలకు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపేందుకు సీ విజిల్ యాప్ పేరిట ప్రజల చేతికి బ్రహ్మాస్త్రం అందించింది. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వారిని కట్టడి చేసేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టింది. నిబంధనలు అతిక్రమించిన వారిపై ఆధారాలతో ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. యాప్ ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలను కేవలం వంద నిముషాల్లోనే పరిష్కరించే దిశగా ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీలు.. ఓటర్లకు ఉపయోగపడేలా వివిధ యాప్‌లను సైతం ప్రవేశపెట్టింది.



ఓటును సద్వినియోగం చేసుకోవాలంటూ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ(ఫైల్)

- పారదర్శక ఎన్నికలకు సీఈసీ చర్యలు
- ఫిర్యాదుల స్వీకరణకు 'యాప్స్'
- 100 నిముషాల్లోనే సమస్యల పరిష్కారం
- నూతన ఓటర్ల నమోదుకు ఏప్రిల్ 15 వరకు అవకాశం
- జాబితాలో పేరు లేకుంటే దరఖాస్తుకు వెసులుబాటు

తిరుపతి అర్బన్ : ఎన్నికల సమయంలో అవినీతికి పాల్పడడం, ఓటర్లకు తాయిలాలు పంపిణీ చేయడం తదితర కోడ్ ఉల్లంఘించే అంశాలను ఆడియో ,వీడియో రూపంలో సీ విజిల్ యాప్ ద్వారా పంపించేలా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఈ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు 100 నిమిషాల్లోనే పరిష్కరించేలా ప్రత్యేక కంట్రోల్‌రూమ్ సైతం ఏర్పాటు చేసింది. మరోవైపు సువిధ, కేవైసీ, సాక్ష్యం, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌లతోపాటు నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ ద్వారా ఎన్నికల సంఘం వివిధ సేవలను అందిస్తోంది. ఆయా యాప్‌ల ద్వారా వచ్చే వినతులు, సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేసింది.

**సువిధ :** అభ్యర్థులు, రాజకీయ పార్టీల ర్యాలీలు, సమావేశాలు, ఇతర ప్రచార సంబంధిత కార్యకలాపాలకు అనుమతులను పొందడానికి ఈ యాప్ దోహదపడుతుంది.

**ఓటర్ హెల్ప్‌లైన్ :** ఓటర్లకు ఓటు నమోదు స్థితి, పోలింగ్ స్టేషన్ వివరాలపై సమాచారాన్ని అందిస్తుంది.

**కేవైసీ :** పోటీలో ఉండే అభ్యర్థులకు సంబంధించి పూర్తి సమాచారాన్ని పొందవచ్చు.

**సాక్ష్యం :** పీడబ్ల్యూడీ ఓటర్లు కచ్చితమైన సమాచారం తెలుసుకోవడానికి సహకరిస్తుంది

**నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ :** ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఫిర్యాదులు, ప్రశ్నలు దాఖలు చేయడానికి ఉపయోగపడుతుంది.

**జిల్లాలో యాప్‌ల ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి కమిటీలు**

| కమిటీ | సంఖ్య |
|---|---|
| ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) | 44 |
| ఎస్ఎస్‌టీ (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్) | 70 |
| ఎఫ్ఎస్‌టీ (ఫ్లయింగ్ స్క్వాడ్స్) | 82 |
| వీఎస్‌టీ (వీడియో నిఘా బృందాలు) | 31 |
| వీవీటీ (వీడియో వీక్షణ బృందాలు) | 08 |

**రిజిస్టర్ చేసుకోండిలా..**

గూగుల్ ప్లే స్టోర్‌లో సీ విజిల్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకోవాలి. సెల్ ఫోన్ నంబర్ ద్వారా రిజిస్టర్ చేసుకోగానే ఓటీపీ ద్వారా లాగిన్ కావాలి. అనంతరం ఈ యాప్ ద్వారా ఎన్నికల్లో జరిగే అవినీతి, అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

**ఎలాంటి ఫిర్యాదులంటే..**

ఎన్నికల్లో డబ్బుల పంపకం, బహుమతులు, రెచ్చగొట్టే ప్రకటనలు, మద్యం పంపిణీ , ఓటర్లను ప్రభావితం చేయడం, ఓటర్లను వాహనాల్లో తరలించడం తదితరాలను ఫిర్యాదు చేయవచ్చు.

**నూతన ఓటర్ల నమోదుకు**

ఏప్రిల్ 15వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించారు. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీకి 18ఏళ్ల పూర్తి అయితే చాలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులే. జాబితాలో మీ ఓటు లేకుండా మళ్లీ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు సైతం అందించారు.

**ఓటు హక్కుపై అవగాహన**

ఓటింగ్ శాతం పెంపేందుకు అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మండల, గ్రామీణ ప్రాంతాల్లో పొదుపు సంఘం సభ్యులు సైతం ఓటు సద్వినియోగం చేసుకోవాలంటూ అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్నారు.

**సద్వినియోగం చేసుకోండి**



ఓటు ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోండి. ఎన్నికల సంఘం అందుబాటులో వచ్చిన యాప్‌ల ద్వారా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలి. ఇప్పటికీ కొత్తగా ఓటు నమోదు దరఖాస్తు చేసుకోవడానికి సమయం ఉంది. కోడ్ నిబంధన మేరకే అందరూ నడుచుకోవాల్సి ఉంటుంది.

– లక్ష్మీశ, జిల్లా ఎన్నికల అధికారి

# సంక్షేమం.. అభివృద్ధే అజెండా

- జనమంతా జగనన్న వెంటే..
- అభినయ్‌ని ఆశీర్వదించండి
- టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : సంక్షేమ.. అభివృద్ధి పథకాలే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందించారని టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. శనివారం తిరుపతిలోని 13, 14వ డివిజన్లలో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ పేదలకు మంచి చేయాలన్న మహోన్నత ఆశయంతో జగనన్న అహర్నిశలు శ్రమిస్తుంటారన్నారు. అయితే జగనన్నను తిట్టడమే అజెండాగా ప్రతిపక్షాలు అసత్య ప్రచారానికి తెగబడుతున్నాయని మండిపడ్డారు. 14 ఏళ్ల పాటు పరిపాలించినా చంద్రబాబు ఏమాత్రం కూడా ప్రజలకు మేలు చేయలేదని, అందుకే ఓటమి భయంతో, పొత్తులు పెట్టుకుని ఎన్నికలకు వస్తున్నారని విమర్శించారు. ఎన్ని పార్టీలతో కలిసి వచ్చినా జగనన్న వెంటే జనమంతా ఉన్నారని తెలిపారు. రూ.3.45లక్షల కోట్లను నేరుగా పేదవాళ్ల ఖాతాలకే సంక్షేమ పథకాల రూపంలో అందించిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. తిరుపతి నగరాన్ని రూ.1,700 కోట్లతో అభివృద్ధి చేయగలిగామంటే ముఖ్యమంత్రి సహకారంతోనే సాధ్యమైందని వెల్లడించారు. ఒక్క తిరుపతిలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కారణంగా 2లక్షల మందికి పైగా లబ్ధిపొందారని తెలిపారు. రెండేళ్లలోనే తిరుపతి రూపురేఖలను మార్చివేసి అద్భుతంగా తీర్చిదిద్దిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో వెళుతుంటే విదేశాల్లో వెళుతున్న అనుభూతి కలుగుతోందని ఆనందం వ్యక్తం చేశారు. మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ కోటూరు ఆంజినేయులు, స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌కే బాబు, పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకుడు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కడపగుంట అమరనాథరెడ్డి, నాయకులు దేవదానం పాల్గొన్నారు.

## 'బాబో'య్ టీడీపీలో ఇమడలేం!



పార్టీలో చేరిన ముస్లిం నేతలతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని 18వ వార్డుకు చెందిన ముస్లిం నేతలు శనివారం సొంత గూటికి చేరుకున్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. వారు మాట్లాడుతూ తొలి నుంచి తాము వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామని, టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి మాయమాటలతో మభ్యపెట్టి పసుపు కండువాలు కప్పేశారని ఆరోపించారు. టీడీపీలో ఒక్కరోజు కూడా ఇమడలేకపోయామని స్పష్టం చేశారు. కోవిడ్ సమయంలో విశేష సేవలందించడమే కాకుండా, ముస్లింలకు అనుక్షణం వెన్నుదన్నుగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి నిలిచారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మధుసూదన్‌రెడ్డి విజయానికి ప్రతి ముస్లిం పనిచేయనున్నట్లు వెల్లడించారు. పార్టీలో చేరిన వారిలో పఠాన్ ఉమర్, సూరాజ్, వసీం ఫరూక్, నజీర్, అష్రఫ్, మహమ్మద్, గౌస్, రబ్బాని, సాజిద్ అహ్మద్ తదితరులు ఉన్నారు.కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా, గోరా, పఠాన్ ఫరీద్, అమాన్, అస్లాం , అబ్బు, షబ్బీర్, కాలేషా పాల్గొన్నారు.

## ఇప్పుడు గుర్తొచ్చామా రిషితా?

శ్రీకాళహస్తి: టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డికి తొట్టంబేడు మండలంలో చుక్కెదురైంది. శనివారం ఆమె ఇంటింటికీ మీ బొజ్జల కార్యక్రమంలో తొట్టంబేడు మండలం, గుండెలిగుంట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆమెకు అడ్డుతగిలారు. నాలుగేళ్లుగా కనపడకుండా ఎన్నికలప్పుడు వచ్చి ఓట్లు అడగడం ధర్మమేనా అని నిలదీశారు. కరోనా కష్ట కాలంలో మేము మీకు గుర్తుకు రాలేదా..?అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో రిషితారెడ్డి సమాధానం చెప్పలేక అసహనంతో అక్కడి నుంచి వెనుదిరిగారు.

## పల్లికొండేశ్వరుని హుండీ లెక్కింపు

నాగలాపురం : మండలంలోని సురుటపల్లెలో ఉన్న సర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో శనివారం హుండీ లెక్కింపు చేపట్టారు. దేవదాయశాఖ అధికారి పనిరాజశయన్, ఆలయ కమిటీ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ఈఓ కె.రామచంద్రారెడ్డి పర్యవేక్షించారు. మొత్తం 72 రోజులకు గాను ఆలయ హుండీ ద్వారా రూ.7,98,570, అన్నదానం హుండీ ద్వారా రూ.2,978 సమకూరినట్లు వెల్లడించారు.

# అండగా ఉంటాం.. ఆశీర్వదించండి


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మేరిగ రేవంత్ చక్రవర్తి, హేమంత్ కల్యాణ్ తదితరులు

**గూడూరురూరల్** : వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటారని, ఆయనను ఆశీర్వదించి గెలిపించాలని మేరిగ రేవంత్ చక్రవర్తి, హేమంత్ కల్యాణ్ విన్నవించారు. శనివారం పట్టణంలోని 2వ వార్డు బనిగిసాహెబ్‌పేటలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా, మేరిగ మురళీధర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. జనం బాగోగులపై పూర్తి అవగాహనతో సుపరిపాలన అందించిన జగనన్నకు ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. మీ ఇంటి బిడ్డ మేరిగ మురళీధర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బూదూరు గురవయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, సతీష్‌రెడ్డి, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కొట్టు గోవర్ధన్, మాజీ కౌన్సిలర్లు తాళ్లూరు శ్రీనివాసులు, కృష్ణ ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కందలి సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీధర్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జి ఎస్‌కే బాబు, మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మగ్దూమ్, అజీజ్‌ఖాన్, అల్తాఫ్, అశోక్, దయాకర్, అన్నం మురళి, వినోద్, అశోక్, పూర్ణ పాల్గొన్నారు.

# కట్టుదిట్టంగా ఎన్నికల బందోబస్తు


పులివర్తివారిపల్లె పోలింగ్ కేంద్రం వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

**పాకాల** : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు కట్టుదిట్టంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. శనివారం 2019 ఎన్నికల్లో రీపోలింగ్ జరిగిన పులివర్తివారిపల్లె పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. అప్పట్లో రీపోలింగ్ చేపట్టడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం అందరి బాధ్యతని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటేసేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల్లో ఎలాంటి హింసాత్మక చర్యలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే వారిపై ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీస్ బలగాలు, మైక్రో అబ్జర్వర్ ఏర్పాటు, వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ వంటి ఏర్పాట్లు చేశామని, దీంతో పాటు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రంపై నిఘా ఉంచి పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అలాగే మండలంలోని కె.వేడ్డేపల్లె పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, స్థానికులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, తహసీల్దార్ వాణిశ్రీ, సీఐ రాజగోపాల్ పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారణే లక్ష్యం

**తిరుపతి అర్బన్** : వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అవసరాల మేరకు నీటి వసతులు కల్పించాలన్నారు. ఇందుకోసం 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా నీటి సమస్యల తలెత్తకుండా పకడ్బందీగా కార్యాచరణ అమలు చేయాలని స్పష్టం చేశారు. నాణ్యమైన నీటిని అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఉపాధి పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని ఆదేశించారు. ప్రధానంగా ఎస్సీ,ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

# ఆర్య వర్క్, ఫ్యాబ్రిక్ పెయింట్‌పై శిక్షణ

**చంద్రగిరి:** యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ వరకు ఉచితంగా మహిళలకు ఆర్యవర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి. సురేష్ బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తెల్ల రేషన్‌కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులన్నారు. కనీసం 8వ తరగతి చదువుకుని ఉండాలని చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఆధార్, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థ కార్యాలయానికి వచ్చి పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట , చంద్రగిరి.79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

**తిరుపతి కల్చరల్** : తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో రెండో రోజు శనివారం భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి విశేష పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక మండలంలో అమ్మవారిని కొలువుదీర్చారు. వేద మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కుంకుమార్చనలో పాలుపంచుకున్న భక్తులకు అమ్మవారి వెండి డాలర్, పసుపు, కుంకుమ, పసుపుదారం, ప్రసాదం అందజేశారు. ఈ క్రమంలో ఆదివారం సైతం లక్ష కుంకుమార్చన కొనసాగనున్నట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈఓ మమత, సభ్యులు టి.వెంకటేశ్వరరావు, పి.ధనశేఖర్, ఎం.హరినాథ్ రెడ్డి, వి.కృష్ణమ్మ, టి.రమణమ్మ, వి.గీత, ఎస్.భారతి పాల్గొన్నారు.

# ఆరోగ్య సంరక్షణపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న తులసీ ఆయుర్వేదిక్ వైద్యులు సాయిప్రియ

**శ్రీసిటీ (వరదయ్యపాళెం):** శ్రీసిటీలోని క్రిక్ సైడ్ అపార్ట్‌మెంట్స్ ఆవరణలో ఆరోగ్య సంరక్షణ, సౌకర్యాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో శ్రీసిటీలో ఉన్న రామచంద్రా, మెడికవర్, కేర్ డెంటల్, శంకర నేత్రాలయ, తులసి ఆయుర్వేదిక్ ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను వివరించారు. అలాగే తమ వైద్యశాలల ప్రత్యేకతలను తెలియజేశారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కుమార్ మాట్లాడుతూ సంస్థ ఆవిర్భావం నుంచి ఈ ప్రాంతంలో వైద్యసేవల అభివృద్ధికి చేపట్టిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ధీరజ్ రెడ్డి (మెడికవర్), డాక్టర్ మెహక్‌ప్రీత్ కౌర్ గిల్ (శంకర నేత్రాలయ), డాక్టర్ సాయిప్రియ (తులసి ఆయుర్వేదిక్), డాక్టర్ సులోచన (రామచంద్రా), డాక్టర్ మెటిల్డ (కేర్ డెంటల్), శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్ కుమార్ (కస్టమర్ రిలేషన్స్), శ్రీసిటీ ఫౌండేషన్ మేనేజర్ సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.

# 25న క్రీడాకారుల ఎంపికలు

**చిల్లకూరు** : రాష్ట్ర స్థాయి మోడ్రన్ పెంటాథలాన్ , పవర్ లిఫ్టింగ్ టోర్నీలో పాల్గొనే అండర్-19 బాల బాలికలకు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 25వ తేదీన ఎంపికలు పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీరేష్ తెలిపారు. శనివారం చిల్లకూరు గురుకుల పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఈత, రన్నింగ్ వచ్చిన వారు మాత్రమే హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9704827095 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.